## క్లుప్తంగా

### చికిత్స పొందుతూ యువకుడి మృతి



నడికూడ : మండల కేంద్రానికి చెందిన కామిద్రి కృష్ణ (25) చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. కృష్ణ కొద్ది రోజులుగా వెన్ను నొప్పితో బాధపడుతుండగా కుటుంబీకులు రెండ్రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ కృష్ణ శుక్రవారం సాయంత్రం గుండెపోటుకు గురై మృతి చెందాడు.

### బాక్సింగ్ చాంపియన్‌కు రూ.10వేల ప్రోత్సాహకం



ధర్మసాగర్ : మండల కేంద్రానికి చెందిన బాక్సింగ్ చాంపియన్ దామెర మేరీకి ప్రోత్సాహకంగా బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రాజనాల శ్రీహరి శుక్రవారం రూ.10 వేలు నగదు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మేరీ వచ్చే నెల 12 నుంచి 17 వరకు హర్యానాలో జరగనున్న జాతీయ స్థాయి ఓపెన్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఎంపికవడం అభినందనీయమని తెలిపారు. మేరీ గతంలో రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిందని గుర్తు చేశారు. జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

### 29న జగిత్యాలకు పద్మశాలీలు తరలిరావాలి

ఆత్మకూరు : జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ బోగ శ్రావణిని అధికార పార్టీ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వేధింపులకు గురి చేయడాన్ని ఖండిస్తూ పద్మశాలీ కులస్తులు ఈనెల 29న జగిత్యాలకు తరలిరావాలని పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు వెల్దె వెంకటేశ్వర్లు కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే వేధింపులు తాళలేక మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రావణి పదవికి రాజీనామా చేయడం బాధాకరమన్నారు. సమావేశంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, వడ్డెపల్లి ప్రసాద్, బలభద్ర కిషోర్, చిమ్మని దేవరాజ్, బిట్ల వీరస్వామి, రాజమౌళి, ఆత్మకూరు గ్రామ అధ్యక్షులు వడ్డెపల్లి వేణుగోపాల్, మార్త కేదారి, ఆత్మకూరు పరపతి సంఘం అధ్యక్షులు మార్త రంజిత్, అలువాల రవి, కొంపల్లి రవీందర్, చిందం నరేందర్, వెంగళదాసు వెంకటనర్సు, పాపని రవీందర్, వడ్డెపల్లి రవి పాల్గొన్నారు.

### ఉర్సు ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

నడికూడ : మండలంలోని ముస్త్యాలపల్లిలోని హజ్రత్ సయ్యద్ మదార్ షావలీ దర్గా ఉర్సు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు దర్గా ముతవలి మహ్మద్ ఖాజీ ఖాద్రి తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 30న గంధం, 31న ఉర్సు జరగనుందని తెలిపారు. కులమతాలకు అతీతంగా ఎనిమిది దశాబ్దాలుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 30న సాయంత్రం పరకాల జామ మస్జిద్ నుంచి కవ్వాలి, షాషాబ్‌ల విన్యాసాలతో గంధం తీసుకొచ్చే కార్యక్రమంతో ఉర్సు ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో హమ్మద్ ముస్తాఫా, అఫ్సర్, నసీరొద్దీన్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హసన్‌పర్తి: మరమ్మతుల కారణంగా చింతగట్టు టౌన్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాల, గ్రీన్‌వుడ్, తేజస్వి, విజ్ఞాన్ పాఠశాలలు ఉన్న ప్రాంతాలతోపాటు దత్తాత్రేయ ఎస్టేట్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ చెప్పారు.

### రేపు ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో సదస్సు

విద్యారణ్యపురి: హనుమకొండ బాలసముద్రంలోని సామజగన్ మెమోరియల్ భవనంలో ఈనెల 29న ఉదయం ప్రజ్ఞాభారతి వరంగల్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ ఎల్.రాంగోపాల్‌రెడ్డి, కోకన్వీనర్ బుచ్చిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నిజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాల్లో భాగంగా 'నిజాం దురాగతాలు–హైదరాబాద్ రాష్ట్ర స్వాతంత్ర్య వీరోచిత పోరాట విశేషాలు–విస్మరించలేని చారిత్రక వాస్తవాలు' అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన వక్తగా హైదరాబాద్‌లోని ప్రముఖ జర్నలిస్టు రాకా సుధాకర్‌రావు ప్రసంగించనున్నట్లు తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

# విత్తనశుద్ధితో చీడపీడల నివారణ

- 'పీవీ' వర్సిటీ ఈఈ డాక్టర్ మహేందర్
- వేరుశనగ పంటలో క్షేత్ర దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న

ధర్మసాగర్ (వేలేరు) : వేరుశనగ పంటలో విత్తనశుద్ధి చేయడం ద్వారా చీడపీడలను నివారించి అధిక లాభాలు పొందవచ్చని పీవీ నర్సింహారావు వెటర్నరీ యూనివర్సిటీ విస్తరణ అధికారి (ఈఈ) డాక్టర్ మహేందర్ తెలిపారు. మామునూర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో వేలేరు మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో వేరుశనగ పంటలో శుక్రవారం నిర్వహించిన క్షేత్రదినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ మహేందర్ హాజరై మాట్లాడారు. భారత్ నూనె గింజల పంట సాగులో నాల్గో స్థానంలో ఉందన్నారు. దేశంలో నూనె గింజల పంటల సాగుకు పెరుగుతున్న గిరాకీకి అనుగుణంగా జాతీయ ఆహార భద్రతలో భాగంగా కేవీకే శాస్త్రవేత్తలు సామూహిక పంటల ప్రథమ శ్రేణి ప్రదర్శనలో భాగంగా వేరుశన పంటపై క్షేత్రదినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న మాట్లాడుతూ వేరుశనగ పంటను నూనె ఉత్పత్తి కొరకే కాకుండా పశువుల దానాగా కూడా ఉపయోగిస్తారని చెప్పారు. వేరుశనగ పంటను విక్రయించే ముందు తేమ లేకుండా చూసుకోవాలని సూచించారు. తేమ ఎక్కువగా ఉంటే అఫ్‌లెటాక్సిన్ అనే విషపదార్థంగా మారి పశువులకు హాని కలిగిస్తుందని చెప్పారు. డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ రైతులు వేరుశనగలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. డాక్టర్ రాజు మాట్లాడుతూ వేరుశనగలో వచ్చే చీడపీడలు, సమగ్ర సస్యరక్షణ గురించి అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు ఉచితంగా వేప నూనె, రసాయనిక పురుగు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) శిల్ప, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌తోనే సమన్యాయం

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



కుండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు : బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండలంలోని నర్సక్కపల్లి గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హనుమకొండలోని తన నివాసంలో బీజేపీ నుంచి చేరిన వారికి ఎమ్మెల్యే ధర్మారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కట్టుబడి పని చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అమలౌతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాల్లోనూ అమలు చేయాలని అక్కడి ప్రజలు ఆయా ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్‌తోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు కోడెపాక కుమారస్వామి, రైతు కమిటీ ప్రధాన కార్యదర్శి పాడి చంద్రారెడ్డి, నాయకులు తాళ్లపెల్లి రవీందర్, వర్షం శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు



అధికారులతో మాట్లాడుతున్న డీపీఓ జగదీశ్వర్

దామెర : 'మన ఊరు–మన బడి'లో భాగంగా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించొద్దని జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ తెలిపారు. మండల కేంద్రంలోని, ల్యాదెల్లలోని పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సదుపాయాలు కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'మన ఊరు–మన బడి' కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. సకాలంలో నాణ్యతతో పనులు పూర్తి చేయాలని చెప్పారు. ఇంకా పనులు ప్రారంభం కాని వాటి విషయమై సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావుకు సూచించారు. డీపీఓ వెంట ఎంపీఓ యాదగిరి, ప్రధానోపాధ్యాయులు పరమేశ్వర్, ఎస్‌ఎంసీ చైర్మన్లు గోనెల సురేష్, పిట్టల రమేష్ తదితరులున్నారు.

### విద్యుత్ అందక ఎండుతున్న పంటలు

- సబ్‌స్టేషన్ వద్ద రైతుల నిరసన



అధికారులతో వాగ్వాదం చేస్తున్న రైతులు

ఐనవోలు : సుమారు 10 రోజులు త్రీఫేస్ విద్యుత్ సరిగా అందక యాసంగి పంటల సాగుకు తీవ్ర ఇబ్బందులు ఎదురౌతున్నాయంటూ మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద రైతులు శుక్రవారం నిరసన తెలిపారు. బోరు, బావుల ద్వారా పండించే పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. సమస్య కొనసాగితే మక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరసన వద్దకు అధికారులు రాగా వాగ్వాదం చోటు చేసుకుంది. యాసంగి పంటలకు ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐనవోలు, ఒంటిమామిడిపల్లి రైతులు నర్సిరెడ్డి, రాజిరెడ్డి, రాజశేఖర్, బుచ్చిరెడ్డి, రాజు, రాములు, రమేష్, కుమార్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# 'కంటివెలుగు'ను వినియోగించుకోవాలి



పరీక్షలు నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్ మంజుల

దామెర : కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని స్థానిక వైద్యాధికారి డాక్టర్ మంజుల కోరారు. మండల కేంద్రంలోని కంటివెలుగు శిబిరాలను శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. కంటివెలుగు రెండో విడత కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజల కోసం మండల కేంద్రంలో, ఊరుగొండలో శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో 874 మంది, ఊరుగొండ కేంద్రంలో 701 మంది పరీక్షలు నిర్వహించినట్టు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు సందీప్, ఉషారాణి, సిబ్బంది శ్రీకాంత్, అశోక్‌బాబు, శ్రీధర్, బాబు, మౌనిక, పద్మ, శోభారాణి, సంధ్య, ఉమ, భారతి, లావణ్య, మమత, సుమలత, రజిత, శైలజ, లీలారాణి, సుజాత, శ్రీదేవి, కవిత తదితరులు పాల్గొన్నారు.

# త్రోబాల్ ప్రతిభావంతుడికి సన్మానం



నితీష్‌ను సన్మానిస్తున్న సర్పంచ్, ఇతరులు

ఎల్కతుర్తి : మండలంలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన పెండ్యాల నితీష్ త్రోబాల్ ప్రపంచస్థాయి పోటీలకు అర్హత సాధించగా స్థానిక పాఠశాల ఆవరణలో ఆయనను సర్పంచ్ మాసిపెద్ది భాస్కర్‌రావు, ఎంపీటీసీ దంపతులు యశోద రాజేశ్వర్‌రావు, ఎస్‌ఎంసీ చైర్మన్ నిమ్మల మనోహర్ శాలువాతో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాస్కర్‌రావు, ఎంపీటీసీ దంపతులు, ఎస్‌ఎంసీ చైర్మన్ మాట్లాడారు. గ్రామానికి చెందిన నితీష్ తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఇటీవల జరిగిన నేషనల్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి ఫిబ్రవరి 23న నేపాల్‌లో జరగనున్న ప్రపంచస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి గ్రామ కీర్తిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయులు, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికవర్గ రాజ్య స్థాపనే ధ్యేయం

- రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శంకర్ నారాయణ



మాట్లాడుతున్న శంకర్ నారాయణ

కమలాపూర్ : కార్మికవర్గ రాజ్య స్థాపనే మార్క్సిజం ధ్యేయమని రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మార్క శంకర్ నారాయణ, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ కన్వీనర్ నేదునూరి రాజమౌళి తెలిపారు. మండల కేంద్రంలో సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతులకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. మార్క్సిజం సిద్ధాంతాన్ని కార్మికవర్గ మేధావులు మార్క్స్, ఏంగిల్స్, లెనిన్ రూపొందించారని తెలిపారు. బూర్జువా పాలకవర్గాలను కూలదోసి సోషలిస్టు వ్యవస్థ నిర్మాణానికి నిరంతర ప్రజాపోరాటాలు కొనసాగుతాయని చెప్పారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఫాసిస్టు ధోరణిని ఎదుర్కొనే శక్తి కమ్యూనిస్టులకే ఉందన్నారు. సమాజంలో ప్రజాస్వామ్యం పేరిట ధనస్వామ్యం, కుల, మతోన్మాదాలు పెరిగిపోయినట్టు తెలిపారు. పాలకులు ప్రజల సంక్షేమాన్ని విస్మరించి దేశ ఆర్థిక వ్యవస్థను నానాటికి దిగజారుస్తున్నారని మండిపడ్డారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ పాలకుల తప్పుడు విధానాల వల్ల పేదలు మరింత పేదరికంలో మగ్గుతుండగా ధనికులు మరింత సంపన్నులౌతున్నారని తెలిపారు. పేదలకు విద్య, వైద్యం, కూడు, గూడు, ఉపాధి అందించడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటాలే శరణ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి నకీర్త ఓదెలు, జిల్లా సమితి సభ్యుడు జక్కు రాజుగౌడ్, రామ్మూర్తి, బాలరాజు, రాజ్‌కుమార్, శంకర్, లక్ష్మి, శిరీష, సునీత, భాస్కర్, తిరుపతి, కిశోర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలలో నిర్మాణ పనులకు శంకుస్థాపన



ఆత్మకూరు : మండల కేంద్రంలోని గొల్లవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వంటశాల, మూత్రశాలల నిర్మాణ పనులకు వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, వంగాల భగవాన్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు అంకూస్, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పాపని రవీందర్, ప్రధాన కార్యదర్శి రేవూరి ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్, హెచ్‌ఎం లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు పార్వతి, కళ్యాణి పాల్గొన్నారు.

# ఎంపీడీఓ కృష్ణమూర్తికి ఘనసన్మానం



శాయంపేటలో..



భీమదేవరపల్లిలో..

శాయంపేట : గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ ఎంపీడీఓగా అవార్డు అందుకున్న సందర్భంగా ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, సర్పంచ్ కందగట్ల రవి, ఉపసర్పంచ్ సుమస్, నాయకులు చింతల భాస్కర్, వినుకొండ శంకరాచారి, బాసాని ప్రకాశ్, చంద్రమౌళి, వంగరి సాంబయ్య, ఎంపీఓ రంజిత్‌కుమార్, సూపరింటెండెంట్ అనురాధ, సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాలస్వామి, ఏపీఓ కీర్తి అనిత, టైపిస్టు శరత్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

#### పంచాయతీ కార్యదర్శికి..

భీమదేవరపల్లి : గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా అవార్డు తీసుకున్న ముల్కనూర్ పంచాయతీ కార్యదర్శి జంగం పూర్ణచందర్‌ను ముల్కనూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శులు జాన రమేష్, వినయ్, అనంతరెడ్డి, హేమంత్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు 'వాల్తేరు వీరయ్య' విజయోత్సవ సభ



పరకాల : మెగా స్టార్ చిరంజీవి నటించిన 'వాల్తేరు వీరయ్య' సినిమా విజయోత్సవ సభ హన్మకొండలో ఈనెల 28న నిర్వహించనున్నట్టు చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ పరకాల అధ్యక్షుడు బొచ్చు భాస్కర్ తెలిపారు. కాకతీయ థియేటర్ ఆవరణలో వాల్తేరు వీరయ్య విజయోత్సవ సభ పాసులను అభిమానులకు శుక్రవారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. సినీ హీరోలు చిరంజీవి, రవితేజతో పాటు వాల్తేరు వీరయ్య సినిమా యూనిట్ సభ్యులు హాజరౌతారని తెలిపారు. సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోటి లింగాచారి, యాకూబ్, సురేష్ పాల్గొన్నారు.

# డీసీసీబీ చైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ



నడికూడ : పరామర్శిస్తున్న నాగుర్ల వెంకటేశ్వర్లు

ఐనవోలు : డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావును మండల కేంద్రంలోని అతడి నివాసంలో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వరంగల్ రెడ్‌క్రాస్ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, సంగెం కందకట్ల నరహరి, ఆత్మకూరు మార్కెట్ చైర్మన్ బొల్లెబోయిన రవియాదవ్, మాజీ కుడా డైరక్టర్ ఎనకతాళ్ల రవీందర్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకులు దుంపలపెల్లి బుచ్చిరెడ్డి, మునిగాల సురేందర్‌రావు, అన్వర్, సంపత్, శ్రీనివాస్ తదితరులుల్గొన్నారు.

#### బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ..



ఆత్మకూరు : పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్, నీరుకుళ్ల గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు పలువురు ఇటీవల చనిపోగా వారి కుటుంబాలను పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం పరామర్శించారు. మృతుల కుటుంబాలను ఓదార్చారు. తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

#### బాధిత కుటుంబానికి ..

నడికూడ : మండలంలోని నర్సక్కపల్లె గ్రామానికి చెందిన బండి ప్రవీణ్ ఇటీవల విద్యుద్ఘాతానికి గురై మృతి చెందగా బాధిత కుటుంబాన్ని తెలంగాణ రైతు విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు శుక్రవారం పరామర్శించారు. అనంతరం ప్రవీణ్ కుటుంబీకులకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కిషన్‌రావు, లోకాటి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# జవాన్ కుటుంబానికి ఆర్థికసాయం



కమలాపూర్ : సాయం అందజేస్తున్న జవాన్లు



భీమదేవరపల్లిలో..

కమలాపూర్ : మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన సీఐఎస్‌ఎఫ్ జవాన్ బండి నరేష్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి సహపాఠి మిలిటరీ జవాన్లు శుక్రవారం రూ.1,21,231 సాయం అందించారు. తొలుత నరేష్ తల్లిదండ్రులైన బాబురావు–శారద దంపతులను పరామర్శించారు. కార్యక్రమంలో జవాన్లు బి.సుధాకర్ రాథోడ్, వైనాల రమేష్, ఎలిగేటి శ్రీనివాస్, కోడెపాక కిరణ్, జనగాం రాజు, బండి ప్రవీణ్, వంగరి రాజేష్, మహేందర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

#### ప్రైవేట్ అధ్యాపకుడి కుటుంబానికి..

భీమదేవరపల్లి : మండలంలోని ముల్కనూర్‌కు చెందిన ప్రైవేట్ కళాశాల అధ్యాపకుడు తంగళ్లపల్లి రాజు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి స్నేహితులు ఆర్థికసాయం అందించారు. తొలుత రాజు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.1.70 లక్షల చెక్కు అందజేశారు. సాయం అందించిన వారిలో లింగమూర్తి, రాజేందర్, మహేందర్, స్టాలిన్, సాంబరాజు, శ్యామల, కళావతి, భాగ్యలక్ష్మి, ఉమ, హసీనా ఉన్నారు.

### 29న సీఆర్పీల మహాసభ

దామెర : ఈనెల 29న హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ల (సీఆర్పీ)ల రాష్ట్ర దశాబ్ది మహాసభ నిర్వహించనున్నట్లు సీఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు జిల్లాలోని సీఆర్పీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్, ఉపాధ్యక్షులు రమేష్, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

# గండ్ర దంపతుల సహకారంతోనే అభివృద్ధి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

శాయంపేట : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతి సహకారంతోనే గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి తెలిపారు. మండలంలోని పత్తిపాక గ్రామంలోని ఏడో వార్డులో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన వసతులు కల్పించేలా చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం గండ్ర దంపతులు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తున్నారని తెలిపారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా గండ్ర దంపతులు ఎనలేని తోడ్పాటు అందిస్తున్నారని చెప్పారు. గ్రామంలో భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోతుగంటి సరోజన మల్లయ్య, బీఆర్‌ఎస్ నాయకులు ఘంటా శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిట్టిరెడ్డి జైపాల్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు పసుల ప్రవీణ్, యూత్ నాయకులు పెండల కిరణ్, పాణి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు అండగా పీఆర్టీయూ



డైరీ ఆవిష్కరిస్తున్న తిరుపతిరెడ్డి, ఇతరులు

ధర్మసాగర్ : ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీల సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ అండగా ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతిరెడ్డి తెలిపారు. ఆ సంఘం నూతన సంవత్సర డైరీని మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో మండల అధ్యక్షుడు ఏ.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ.జాన్‌సింగ్ ఆధ్వర్యంలో ఎంఈఓ వెంకటేశ్వర్‌రావుతో కలిసి తిరుపతిరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం తిరుపతిరెడ్డి మాట్లాడారు. జీఓ 317 ద్వారా ఇతర జిల్లాలకు కేటాయించబడిన స్పౌజ్ ఉపాధ్యాయులను తిరిగి రప్పిస్తామని చెప్పారు. ప్రమోషన్లు, బదిలీలు పారదర్శకంగా జరిగేలా సంఘం బాధ్యత తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు, హైస్కూల్ హెచ్‌ఎం సుమాదేవి, ఎంఏఎంబి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట

నయీంనగర్ : రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుతో కలిసి చీఫ్‌విప్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్ కోమల, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, డీపీఆర్‌ఓ లక్ష్మణ్‌కుమార్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్‌మోహన్, కోశాధికారి బొల్ల అమర్, సీనియర్ జర్నలిస్టులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.